

కథా కౌముది

# జీవనచిత్రం

పాలపర్తి జ్యోతిష్మతి

లాంగ్ వీకెండ్!

రోడ్డుకి ఒకవైపు అల్లంతదూరంలో కనిపిస్తూ ఎత్తైన జలపాతం. దాని పక్కనే ఆధునికీకరింపబడిన పురాతన దేవాలయం. మరోవైపు పిల్లలని ఉర్రూత లూగించే రకరకాల ఆటల పరికరాలతో పెద్ద పార్కు. సెలవులని అక్కడ గడపడానికి వచ్చే పర్యాటకులకోసం నాలుగయిదు స్టార్ హోటళ్ళు, రెండు షాపింగ్ మాల్స్. కొత్తగా వెలుగులో కొచ్చిన, అన్నివయసులవాళ్ళనీ ఆకర్షిస్తున్న విహారయాత్రాస్థలం. అక్కడినించి ముందుకెళ్ళడాని కేమీ లేదు, వెనక్కి రావలసిందే. ప్రత్యేకంగా చూడాలనుకుని అక్కడికి రావలసిందేగానీ ఎటో వెళ్తూవెళ్తూ దారిలో కనబడిరదికదాని ఆగి చూసే ప్రాంతం కాదది.

రాష్ట్రం మూలమూలల్నించి బయలుదేరిన కార్లు సర్రుసర్రున దూసుకొచ్చి హోటళ్ళ ముందు ఆగుతున్నాయి. ముందే హోటళ్ళలో గదుల వసతి ఏర్పాటు చేసుకున్న వాళ్ళంతా కార్లు దిగి గదుల్లోకి వెళ్ళిపోతున్నారు. అటువంటి ఏర్పాటు లేనివాళ్ళు అప్పటికప్పుడు గదులు దొరుకుతాయేమోనని వాకబు చేసుకుంటున్నారు.

నాలుగురోజుల సెలవుల్లో ఎటైనా తిరిగి రావాలని అనుకుంటూనే ఉన్నా, ఎక్కడి కెళ్ళాలనే నిర్ణయం తీసుకోవడంలో తాత్సారం చేసిన యువజంట యమున, శ్రీనివాస్ కూడా అక్కడికే వచ్చి వసతి గదికోసం వెతుక్కుంటూ తిరుగుతున్నారు. అన్ని హోటళ్ళలో ‘లేవు’ అన్న సమాధానమే దొరకడంతో నిస్పృహగా ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు.

పిల్లల కేరింతలు, పెద్దవాళ్ళ అరుపులతో గోలగోలగా ఉన్న ఆ ప్రదేశమంతా నెమ్మదిగా సద్దుమణిగి కాసేపటికి పూర్తి నిశ్శబ్దం ఆవరించింది. ఇద్దరూ ఒకేసారి వాచీలు చూసుకున్నారు.

‘‘అమ్మో, పదయిపోయింది’’ అంది యమున కంగారుగా.

‘‘రాత్రి ఈ టైంలో ఎక్కడి కెళ్ళడం? ఏం చెయ్యడం?’’ ఆందోళనగా అన్నాడు శ్రీనివాస్.

ఇద్దరూ ఆలోచనలో పడ్డారు. ''దగ్గర్లో, చుట్టుపక్కల ఊళ్ళలో లాడ్జీ లేమైనా ఉన్నాయేమో, రాత్రికి ఉండడానికి ఒక గది ఎక్కడైనా దొకుతుందేమో చూద్దాం'' అంది యమున.

ఇద్దరూ గబగబా సెల్‌ఫోన్లు తీసి 'ఎకామడేషన్ నియర్ మి' అని గూగుల్‌లో టైప్ చేసి ఆరాటంగా వెతకడం మొదలు పెట్టారు. ఒక పది నిముషాల శోధన అనంతరం ''ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓమాదిరి ఊళ్ళో మంచిలాడ్జిలో గదులు దొరుకుతాయన్నట్టు చూపిస్తోంది'' అంది యమున ఆనందంగా.

శ్రీనివాస్ యమున సెల్‌లోకి తొంగిచూసి ''బుక్ చేసేసుకుని వెళదాం'' అన్నాడు. యమున తన సెల్ శ్రీనివాస్ చేతిలో పెట్టింది. శ్రీనివాస్ సెల్ తీసుకుని ఫోన్ చేసి ఆ హోటల్ వివరాలు కనుక్కుని గది బుక్ చేశాడు.

''పదిన్నర అవుతోంది. ఆకలేస్తోంది. తిని బయలుదేరదాం'' అంది యమున.

మళ్ళీ అన్వేషణ మొదలు పెట్టారు. 'అయిపోయింది', 'మూసేశాం' అన్న సమాధానాల్నే మళ్ళీమళ్ళీ పొంది నిరాశగా కార్లో కూలబడ్డారు.

''సరే! ముందర గది కెళ్ళి పడదాం. అక్కడేమైనా దొరుకుతుందేమో చూద్దాం'' అంటూ కారుని బయలుదేరదీశాడు శ్రీనివాస్.

వెంటనే యమున గది బుక్ చేసుకున్న హోటల్‌కి ఫోన్ చేసి ''ఒక అరగంటలో వస్తున్నాం. భోజనం ఏమైనా ఏర్పాటు చెయ్యగలరా?'' అని అడిగింది.

''ఈ టైంలో కష్టం మేడమ్. వర్కర్స్ అందరూ వెళ్ళిపోయారు. సారీ'' అంటూ ఫోన్ పెట్టేశారు అవతలివాళ్ళు.

యమున కాసేపు సెల్‌ని అటూఇటూ గీరి ''పెద్ద ఊరు కాదట్టుంది. స్విగ్గీ, జొమాటో లాంటివి కూడా ఏమీ కనిపించట్లేదు'' అంది.

''చూద్దాంలే! అదృష్టం బాగుంటే దారిలో ఏమైనా దొరకచ్చు'' అన్నాడు శ్రీనివాస్.

ఒక పది కిలోమీటర్లు వెళ్ళేసరికి చిన్న పల్లెటూర్లో రోడ్డు పక్కన ఉన్న పెంకుటింటి చూరుకి వేళ్ళాడుతున్న 'టిఫిన్ సెంటర్' అన్న బోర్డు కనిపించింది. లైట్లు వెలుగుతున్నాయి. మనుషులు కనిపిస్తున్నారు. టిఫిన్ దొరకొచ్చన్న ఆశ కలిగింది. వెంటనే కారుని పక్కకి తిప్పి ఒక్క కుదుపుతో ఆ ఇంటిముందు ఆపాడు శ్రీనివాస్.

''ఇక్కడ ఆపావేంటి?'' కంగారుగా అడిగింది యమున.

చేత్తో బోర్డువైపు చూపించాడు శ్రీనివాస్.

''ఇక్కడా?'' మొహం వికారంగా పెట్టి అడిగింది యమున.

''మెట్రోపాలిటన్ సిటీలో పుట్టి పెరిగిన నీకు ఇట్లాంటి హోటళ్ళగురించి తెలీదుగానీ పల్లెటూళ్ళో పుట్టి పెరిగిన నాకు ఇట్లాంటిచోట తినడం మామూలు విషయమే'' అంటూ కారు దిగాడు శ్రీనివాస్.

''ఏం ఉంటుందో! ఆ ఉన్నది ఎట్లా ఉంటుందో!'' నసుగుతూనే దిగింది యమున.

''పెద్దవాళ్ళు 'ఆకలి రుచి ఎరగదు' అన్నారు. 'ఆకొన్న కూడె అమృతము' అన్నాడు శతకకారుడు. ఇది కాదనుకున్నామంటే తరువాత ఏమీ దొరకదు'' అన్నాడు శ్రీనివాస్ కారు లాక్ చేసి ముందుకు నడుస్తూ.

''ఏమిటేమిటో నా కర్థం కానివన్నీ చెప్తావు'' సణుక్కుంటూ అనుసరించింది యమున.

వసారాలో కూర్చుని మాట్లాడుకుంటున్న ఆ ముగ్గురు ` ఒక ఆడమనిషి, ఒక మగమనిషి, ఒక పదిహేనేళ్ళ పిల్లాడు' వీళ్ళని చూడడంతోటే లేచి నిలబడ్డారు. ఇంటిముందు ఆరుబయట వేసి ఉన్న కుర్చీలు, టేబుళ్ళు గబగబా సర్దారు. కూర్చున్నాక ''వేడివేడిగా ఇడ్లీలు ఉన్నాయమ్మా! దోసెలుగానీ, చపాతీలుగానీ కావాలంటే ఇప్పుడే వేడిగా చేసి పెడతాను'' అంది ఆడమనిషి. యమున, శ్రీనివాస్ ఏం తినాలో ఆలోచించుకునే లోపల పిల్లాడు రెండు గ్లాసులతో మంచినీళ్ళు తెచ్చి పెట్టాడు. అప్పటికే మగమనిషి వెళ్ళి పొయ్యి వెలిగించాడు.

''ముందు రెండు ప్లేట్లు ఇడ్లీ తెచ్చిపెట్టమ్మా!'' అన్నాడు శ్రీనివాస్.

ఆడమనిషి వెళ్ళి రెండుపళ్ళాలలో నాలుగేసి ఇడ్లీలు పెట్టి తెచ్చింది. ఆమె వెనకాలే పిల్లాడు రెండు గిన్నెల్లో ఇడ్లీచట్నీ, టమాటాపచ్చడి తెచ్చి పెట్టాడు. ఆమె రెండు పచ్చళ్ళు కాస్తకాస్త పళ్ళాల్లో వేసి ''ఏది కావాలంటే అది కావలసినంత వేసుకోండమ్మా!'' అని చెప్పి పొయ్యి దగ్గరి కెళ్ళింది.

''ప్లేటంటే నాలుగిడ్లీలా?'' ఆశ్చర్యంగా అడిగింది యమున.

''పెద్దపెద్ద రెస్టారెంట్లలో నాజూగ్గా ప్లేటుకి రెండిడ్లీలే ఇస్తారుగానీ ఇట్లాంటిచోట నాలుగు పెడతారు'' అన్నాడు శ్రీనివాస్ ఆత్రంగా ఇడ్లీలమీద దాడి చేస్తూ.

ఒకదాని తరువాత ఒకటిగా ఓ పది కార్లు వచ్చి ఆగాయి అక్కడ కాసేపట్లో. వాటిల్లోంచి జనం బిలబిలా దిగి కుర్చీలని ఆక్రమించారు. ఎవరికి కావలసింది వాళ్ళకి త్వరత్వరగా అందించడంలో మునిగిపోయారు ఆ ముగ్గురూ.

యమున, శ్రీనివాస్ ఇడ్లీలు తినడం పూర్తిచేసి తలెత్తి చూడగానే పరిగెత్తుకుంటూ వాళ్ళ దగ్గరికి వచ్చి ''ఇంకేం తెమ్మంటారు సార్?'' అని అడిగాడు పిల్లాడు.

''చపాతి'' అన్నాడు శ్రీనివాస్.

''నాకు దోసె'' అంది యమున.

తెమ్మన్నట్టు తలూపాడు శ్రీనివాస్. పిల్లాడు పరిగెత్తాడు.

''అసలు ఈ టైంలో ఇంతమందికి టిఫిన్ సప్లై చెయ్యడానికి ఏర్పాట్లు చేసుకుని ఎదురు చూస్తున్నట్టు కూర్చునున్నారు. ఎట్లా...?'' అంది యమున.

''ప్రతిరోజూ ఇంతమంది ఇట్లా వచ్చే అవకాశం లేదు, అలవాటుగా ఏర్పాట్లు చేసుకున్నా రనుకోవడానికి. అక్కణ్ణించి జనం వస్తున్నారన్న సమాచారం వెంటనే అందే ఏర్పాటేమైనా ఉన్నా – ఇడ్లీ, దోశ ఇప్పటికిప్పుడు ఎట్లా సాధ్యం!'' సాలోచనగా అన్నాడు శ్రీనివాస్.

''గ్రేట్ బిజినేస్ టాక్టిక్!'' అంది యమున.

''నిజమే! బిజినెస్సే! ఈ బిజినెస్సే వాళ్ళకి జీవనోపాధి. కానీ... కేవలం వ్యాపారం, జీవనోపాధి మాత్రమే కాదు. అంతకు మించినది ఏదో ఉంది'' అన్నాడు శ్రీనివాస్ ప్రశంసాపూర్వకంగా.

విచిత్రంగా చూసింది యమున శ్రీనివాస్ వైపు.

పిల్లాడు చపాతి, దోసె ఒకే పళ్ళెంలో పెట్టుకుని, ఆ పళ్ళెం ఒక చేతిలో, చపాతీకూరగిన్నె రెండో చేతిలో పట్టుకుని తీసుకొచ్చి, ఇడ్లీలు తిన్న పళ్ళాల్లోనే శ్రీనివాస్‌కి చపాతి, యమునకి దోశ పెట్టి, కూర, పచ్చళ్ళు కూడా వేసిఅన్ని గిన్నెలూ తీసుకుని వెళ్ళిపోయాడు. అందరికీ అట్లాగే అడిగినవి అడిగినట్టు ముందు తిన్న పళ్ళాల్లోనే వడ్డిస్తున్నారు.

తినడం పూర్తిచేసి చెయ్యి కడుక్కుంటూ ''కాసేపు కూర్చుందాం'' అంది యమున.

''ఏం?'' అన్నాడు శ్రీనివాస్.

''ఇంత హడావుడిగా ఎవరడిగినవి వాళ్ళకి పెడుతున్నారు గదా! అన్నీ గుర్తు పెట్టుకుని డబ్బులు ఎట్లా లెక్కకట్టి తీసుకుంటారో చూద్దామని'' అంది యమున.

చిన్నగా నవ్వాడు శ్రీనివాస్. ప్రశ్నార్థకంగా చూసింది యమున. ''చూడు'' అన్నాడు శ్రీనివాస్.

అందరూ తినడం పూర్తి చేసి కాఫీ, టీలకి ఆర్డరిస్తున్నారు. ఆడమనిషి గిన్నెల్లో మిగిలిన పదార్థాలు వాళ్ళు ముగ్గురికి పళ్ళాల్లో సర్దుతోంది. మగమనిషి కాఫీ, టీలు అందిస్తున్నాడు. పిల్లాడు శ్రీనివాస్, యమునల దగ్గరికి వచ్చి ''కాఫీ... టీ...'' అన్నాడు.

శ్రీనివాస్ యమునవైపు చూశాడు. వద్దన్నట్లు తలూపింది యమున.

''వద్దులే. బిల్ తీసుకురా'' అన్నాడు శ్రీనివాస్ పిల్లాడితో.

''డబ్బులు అమ్మకి ఇవ్వండి'' అనేసి వెళ్ళిపోయాడు పిల్లాడు.

ఇద్దరూ ఆడమనిషివైపు చూశారు. తిన్నవాళ్ళందరూ ఆమె దగ్గరికి వెళ్ళి 'ఎంతయిం'దని అడుగుతున్నారు. 'ఏం తిన్నారు' అని వాళ్ళనే అడిగి వాళ్ళు చెప్పిందాన్నిబట్టి ఎంతివ్వాలో లెక్కేసి చెప్తోంది ఆమె. వాళ్ళిచ్చిన డబ్బు తీసుకుని రేకుడబ్బాలో వేసుకుంటోంది. చిల్లర రావలసినవాళ్ళు అడుగుతుంటే 'ఎంతిచ్చారు, ఎంతయింది' అని మళ్ళీ వాళ్ళనే అడిగి లెక్కకట్టి చిల్లర వెనక్కి ఇస్తోంది.

''దగ్గర కొచ్చి డబ్బు లిస్తున్నవాళ్ళ దగ్గర తీసుకుంటోంది, ఎవరు వెళ్తున్నారో పట్టించుకోవట్లేదు. తిన్నవాళ్ళు డబ్బు ఎగ్గొట్టి పోరన్న నమ్మకం. ఎవరు ఏం తిన్నామని చెప్తున్నారో దాన్నిబట్టే డబ్బు లెక్కగట్టి చెప్తోంది. వాళ్ళు లెక్కపెట్టి ఇస్తున్నారుగానీ ఆమె లెక్కపెట్టుకోవట్లేదు. ఎక్కువ ఇచ్చిన వాళ్ళకి కూడా వాళ్ళు చెప్పినదాన్ని బట్టే చిల్లర ఇస్తోంది చూడు. నమ్మకం, మనిషిమీద నమ్మకం'' అన్నాడు శ్రీనివాస్.

''వాళ్ళు ఇవ్వడానికి లెక్కపెట్టేటప్పుడే ఎంత ఇస్తున్నారో గమనిస్తోందేమో'' అంది యమున ఆమెనే దీక్షగా చూస్తూ.

''అవకాశం లేదు, అంత తీరిగ్గా లేదు ఆమె'' అన్నాడు శ్రీనివాస్ నిశితంగా ఆమెవైపు చూస్తూ.

''నువ్వు కాస్త ఎక్కువో తక్కువో ఇచ్చి మాట్లాడకుండా వచ్చెయ్'' అంది యమున.

''తప్పు. ఇటువటి స్వచ్ఛమైన మనుషుల్ని అట్లా పరీక్షించ కూడదు'' అన్నాడు శ్రీనివాస్.

'అర్థం కాలే' దన్నట్టు చూసింది యమున. 'అదంతే' అన్నట్టు కళ్ళు మూసి తెరిచాడు శ్రీనివాస్.

జనమంతా వెళ్ళిపోయేదాకా అట్లాగే కూర్చున్నారు యమున, శ్రీనివాస్. ఆ ముగ్గురూ గబగబా సామానంతా సర్దేసుకుంటున్నారు. యమున, శ్రీనివాస్ లేచి వాళ్ళ దగ్గరి కెళ్ళారు.

''ఏం తిన్నారు బాబూ?'' అని అడిగి డబ్బు తీసుకుని రేకుడబ్బాలో వేసుకుంది ఆమె.

''అన్నదాత సుఖీభవ'' అన్నాడు శ్రీనివాస్ నవ్వుతూ.

శ్రీనివాస్ వాడే ఇటువంటి చాలా మాటలకి అర్థాలు యమునకి తెలియవు. కానీ తరుచుగా శ్రీనివాస్ తిన్న తరువాత 'అన్నదాత సుఖీభవ' అంటుండడంతో ఆమాటకి అర్థం అడిగి తెలుసుకుని గుర్తు పెట్టుకుంది.

శ్రీనివాస్ మాటలకి మగమనిషి ఆనందంగా, ఆడమనిషి మొహమాటంగా, పిల్లాడు అయోమయంగా నవ్వారు.

'అంత పొగడ్త అవసరమా?' అన్నట్టు విసుగ్గా శ్రీనివాస్‌వైపు చూసింది యమున. ఇద్దరూ కారువైపు నడిచారు.

ఆ ముగ్గురూ కూర్చుని పళ్ళాలు చేతుల్లోకి తీసుకుని తినడం మొదలు పెట్టారు.

కారు దగ్గరికి వచ్చి నిలబడి ''వాళ్ళు ఏదో మాట్లాడుకుంటున్నారు, విను'' అన్నాడు శ్రీనివాస్.

ఈ ఇద్దరూ చీకట్లో కారుకి ఆనుకుని నిలబడి వెలుతురులో ఉన్న ఆ ముగ్గురివైపు చూస్తూ వాళ్ళ మాటలు వింటున్నారు. వాళ్ళ మాటలు గాలిలో తేలి వచ్చి వీళ్ళ వీనుల్ని సోకుతున్నాయి.

''చూడు అన్నీ ఖాళీ అయిపోయాయి. మనకి కూడా బొటాబొటిగా మిగిలాయి. 'టయమింతయిపోయింది, ఎవరూ రాకపోతే చేసినవన్నీ పాడైపోతాయి, దండగయిపోతాయి. వస్తారో రారో తెలీని వాళ్ళకోసం నిద్రకాచి మనం ఇంతసేపు కూర్చోవాలా? పగలల్లా చేసిన చాకిరి చాలదా?' అన్నావు కదా!'' అంది ఆడమనిషి కొడుకుతో.

పిల్లాడు తల్లి వైపు ఆశ్చర్యంగా చూశాడు.

''వరసగా నాలుగు రోజులు సెలవలని నిన్న అనుకుంటుంటే విన్నాను. ఈ నాలుగు రోజులు గడపడానికి అక్కడికి చాలామంది వస్తారు. పగలంతా బోలెడు కార్లు ఆవేపెల్లడం చూస్తూనే ఉన్నాంగదా!'' అంది చేత్తో జలపాతంవైపు చూపిస్తూ.

''అయితే...?'' అన్నాడు కొడుకు.

''నిత్యం ఇంత రద్దీ ఉండదు కాబట్టి ఎప్పుడో ఒకసారి వచ్చే ఇంతమందికి అక్కడ గదులు దొరకవు. చుట్టుపక్కలూళ్ళల్లో గదులేమైనా దొరుకుతాయేమోని అక్కడ గదులు దొరకని వాళ్ళంతా వెనక్కి, ఇటే వస్తారు. అక్కడ వండి పెట్టేవి కూడా అక్కడి కొచ్చిన వాళ్ళందరికీ చాలవు. వెనక్కి వచ్చేవాళ్ళంతా హోటళ్ళేమైనా ఉంటాయేమోని

చూసుకుంటూ వస్తారు. అక్కడ దొరికేవి నచ్చక, నచ్చేతిండి దొరుకుందేమోని చూసుకుంటూ కొంతమంది ఇటొస్తారు. చూడు కొన్ని కార్లు తిన్నాక మళ్ళీ అటేపే వెళ్ళాయి...''

''ఇదంతా నీ కెట్లా తెలుసు?'' ఆమె మాటలకి అడ్డు పడుతూ అసహనంగా అడిగాడు పిల్లాడు.

''మన బతుకుతెరువుగా ఈ పని మొదలు పెట్టుకున్నోళ్ళం, అన్నీ జాగ్రత్తగా గమనించుకోవాలి...''.

తల్లీకొడుకుల మాటల్ని చిరునవ్వుతో వింటున్నాడు మగమనిషి.

''ఇట్లాంటి రద్దీ సమయాల్లో ఒళ్ళు హూనం చేసుకుని వాళ్ళ ఆకలిమీద మనం వ్యాపారం బాగా చేసుకోవచ్చంటావా యేంటి?'' మళ్ళీ తల్లి మాటలకు అడ్డుపడుతూ విసుగ్గా అడిగాడు పిల్లాడు.

''ఆడ తినడాని కేమీ దొరకనోళ్ళు, ఆడ దొరికింది నచ్చనోళ్ళు – అంతా ఆవురావురంటూ వస్తారు మన కాడికి. ఎట్టాగోట్టా ఆకలికి తిండి పెట్టాలి. ఆ గొప్పోళ్ళకి ఉచితంగా పెట్టేటంతటోళ్ళం కాదు మనం. మనం దానంగా పెట్టినా వాళ్ళు తినరు. మనకి పూట గడవాలంటే మన యాపారం మనం చేసుకో వలసిందే కానీ ఇది ఆకలిమీద యాపారం కాదురా అబ్బాయీ!'' తల్లీకొడుకుల సంభాషణలో కలుగజేసుకుని ప్రశాంతంగా చెప్పాడు మగమనిషి.

''మరే! 'నిద్ర కాసి ఇంత చాకిరి చెయ్యడం అవసరమా?' అనుకోకూడదయ్యా! ఆకలితో వచ్చినవాళ్ళ కడుపులు నింపడం మడుసులుగా మన బాద్దెతరా నాయనా!'' అంది ఆమె కొడుకు తల నిమురుతూ.

శ్రీనివాస్ యమునవైపు చూసి 'అదీ సంగతి' అన్నట్టు కళ్ళెగరేశాడు. యమున కళ్ళు చెమ్మగిల్లాయి. శ్రీనివాస్ కారులో కూర్చుని స్టార్ట్ చేశాడు. కారు లైట్లు వెలగగానే ఆ ముగ్గురూ కారువైపు చూశారు. యమున చెయ్యి ఊపుతూ ''బాయ్ అంటీ! బాయ్ అంకుల్! బాయ్‌రా బాబూ!'' అంటూ వాళ్ళకి తనదైన భాషలో తృప్తిగా వీడ్కోలు చెప్పి కారెక్కి కూర్చుంది.

★★★★

**COMMENTS**